తేది: 27.02.2017

భారతదేశంలో ఉపాధ్యా విద్య – సమస్యలు మరియు సవాళ్ళు అన్న అంశంపై 27–28 తేదీలలో జరగనున్న రెండు రోజుల యు.జి.సి జాతీయ సదస్సు నేడు ద్రావిడ విశ్వవిద్యాలయం ఎమెనో భవనంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ గారు మాట్లాడుతూ... విద్యాభివృద్ధికి సంబంధించి అనేక కమిటీలు, కమీషన్లు ఏర్పాటు చేసినప్పటికీ నాణ్యమైన విద్య సాధించలేకపోయామన్నారు. కొఠారి కమీషన్ రిపోర్టును అనుసరించివున్నట్లైతే ఇప్పటికే విద్యలో మనం ప్రగతి సాధించివుండవచ్చని అన్నారు. నాణ్యమైన విద్య అందించాలంటే ముఖ్యంగా ఉపాధ్యాయుల్లో నిబద్ధత, సామర్థ్యం అవసరమన్నారు. నాణ్యమైన విద్యా బోధనకు ఉపాధ్యాయుల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి మార్పులో ప్రయత్నంగానే ఈ రెండు రోజులు జరిగే కార్యక్రమంలో సరైనటువంటి చర్చలు సాగాలని, సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

సదస్సు సంచాలకులు ఆచార్య డి.శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ... విద్యా వ్యవస్థకే ఉపాధ్యాయ విద్య వెన్నెముక అని అన్నారు. ఈనాడు మన రాష్ట్రంలో, దేశంలో ఉపాధ్యాయ విద్య ఉండాలా వద్దా అన్నది పెద్ద సమస్యగా మారుతోందన్నారు. ఉపాధ్యాయ విద్యలోని సమస్యలు, సవాళ్ళు కూలంకషంగా చర్చించి ఆయా ఉన్నతాధికారులకు తగిన సూచనలను, సలహాలను, ప్రతిపాదనలను అందించడానికే ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సదస్సులో కీలకోపన్యాసం చేసిన తమిళనాడు సెంట్రల్ యూనివర్శిటీ ఆచార్యులు ఆర్.కర్పగ కుమరవేల్ గారు మాట్లాడుతూ... నూతన విజ్ఞానాన్ని సృష్టించడం మరియు దానిని అందరికీ అందించడమే ఉన్నతమైన విద్యా లక్షణమన్నారు. ప్రపంచంలో రెండవ అత్యున్నత విద్యా వ్యవస్థ కలిగివున్నప్పటికీ భారతదేశంలో ఈనాటికీ విద్యలో నాణ్యత సాధించలేకపోతున్నామన్నారు. విద్యలో ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకోవడానికి ఆన్‌లైన్ విద్యా వ్యవస్థ అవసరమని, అందుకు తగిన విద్యా ప్రణాళికలు రూపొందించుకోవడం చాలా అవసరమని అన్నారు.

ప్రత్యేక అతిథి ఎస్.వి.యూనివర్శిటీ ఐఏఎస్ఈ ప్రిన్సిపల్ ఆచార్య టి.కుమారస్వామి మాట్లాడుతూ... బీఈడీ కోర్సును రెండు సంవత్సరాలకు పొడిగించడం ద్వారా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్న బీఈడీ కాలేజీల్లోనే విద్యార్థుల్లేక వారికి తగిన ప్రయోగశాలలు, వసతులు లేకపోగా దానికితోడు బోధనా సిబ్బంది కొరత కూడా అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో కూడా సరైన పర్యవేక్షణ లేక  అద్దె భవనాల్లో రాత్రికిరాత్రే అనేక బీఈడీ కళాశాలలు పుట్టుకొస్తున్నాయన్నారు. ఎన్‌సీటీఈ రీజనల్ సెంటర్లను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఈడీ సిలబస్‌లో జీవన నైపుణ్యాలకు సంబంధించిన పాఠ్యాంశాలకు ప్రధాన స్థానం కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.తిరుపతిరావు, డీన్ ఆచార్య లోకనాథరెడ్డి, బెంగళూరు విశ్వవిద్యాలయం ఆచార్యులు ఉమ్మెకుల్సుం, డా.ఆర్.యశోద, డా.విజయవర్ధిని, డా.మెర్సీజ్యోతి, డా.సరస్వతి, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




